
## మూసీని తలపిస్తున్న గాంధారి వాగు



2

## కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు




2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## స్ట్రాంగ్ రూంను పరిశీలించిన డీఐఈవో

**అక్షరటుడే, బోధన్:** బోధన్ పోలీస్ స్టేషన్‌లోని ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల స్ట్రాంగ్ రూంను డీఐఈవో రవికుమార్ ఆదివారం తనిఖీ చేశారు. ప్రశ్న పత్రాలను భద్రపరచిన గదిని పరిశీలించారు. ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు సూచించారు.




22-2-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## మల్లికార్జున స్వామి ఆలయంలో జాజాల పూజలు



**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలంలోని నారాయణగిరి వద్ద కొలువైన మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ఎల్లమ్మ కల్యాణం నిర్వహించారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ జడ్పీటీసీ తానాజీ రావు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.




## గూండాల్లా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**అక్షరటుడే, ఇందూరు:** కామారెడ్డిలోని కాంగ్రెస్ నాయకులు గుండాల్లా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆరోపించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి క్యాంప్ ఆఫీస్‌పై దాడికి నిరసనగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అక్కడి నాయకులు ఎమ్మెల్యేపై దౌర్జన్యంగా దాడి చేసేందుకు కుట్రపన్నారు. కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు నిజమైతే అందుకు సంబంధించిన రుజువులు అధికారుల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి తగిన రుజువులు కలెక్టర్ ముందు పెట్టేందుకు సిద్ధమయ్యారని, దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు కూడా ముందుకు రావాలని సవాల్ విసిరారు. ఉమ్మడి జిల్లాలో ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని సహించలేని కాంగ్రెస్ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**ఉమ్మడి జిల్లాలో వాతావరణ మార్పు మొదలైంది. చలి నుంచి వేడి దిశగా ఉష్ణోగ్రతలు మారుతున్నాయి. ఫిబ్రవరి మూడోవారం ముగిసే సమయానికే ఎండల తీవ్రత పెరగడం ప్రారంభమైంది. గత నాలుగు ఐదు రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆదివారం జిల్లాలో ఉష్ణోగ్రత 34.4 డిగ్రీలకు చేరుకుంది. ఇది సాధారణం కన్నా ఒక డిగ్రీ ఎక్కువ కావడం గమనార్హం.**

**- అక్షరటుడే, ఇందూరు**




గత ఐదు రోజుల ఉష్ణోగ్రతలు

| వారం | ఉష్ణోగ్రత (డిగ్రీలలో) |
|---|---|
| మంగళవారం | 33.9 |
| బుధవారం | 33.1 |
| గురువారం | 33.2 |
| శుక్ర వారం | 32.9 |
| శనివారం | 34.0 |

- జిల్లాలో 34.4 డిగ్రీలకు పైగా సెల్సియస్ నమోదు
- ఈసారి ఎండలు ఎక్కువే అంటున్న అధికారులు

ఫిబ్రవరి పూర్తి కాకముందే ఉమ్మడి జిల్లాలో ఎండ తీవ్రత పెరుగుతోంది. రానున్న రోజులు మరింత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పగటిపూట ఉక్కపోత ప్రారంభమైంది. దీంతో పలువురు ఫ్యాన్లు, కూలర్లకు పని చెబుతున్నారు. ప్రధానంగా శివరాత్రి నుంచి పగటిపూట ఉష్ణోగ్రతలు 32 డిగ్రీలకు పైగానే నమోదవుతుంది. ఈ నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా నీటి శాతం ఎక్కువగా ఉండేలా ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

జిల్లాలో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరగడంతో జ్యూస్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో చెరుకు రసం, పండ్ల రసం, కర్బుజ, మజ్జిగ తదితర దుకాణాలను ప్రారంభించారు. అలాగే ఎండ నుంచి రక్షణగా టోపీలు, కూల్ గ్లాసెస్‌కు సైతం గిరాకీ పెరిగింది. ఇప్పటికే నగరంలో మధ్యాహ్నవేళలో కాస్త ట్రాఫిక్ కూడా తగ్గినట్టుగా కనబడుతోంది.

### కాటన్ దుస్తులను ధరించాలి



వేసవికాలంలో తప్పకుండా కాటన్ దుస్తులు ధరించాలి. అత్యవసరమైతేనే మధ్యాహ్నం వేళలో బయటకు వెళ్లాలి. ప్రధానంగా వృద్ధులు, గర్భిణులు చిన్నారులు ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు నీటి శాతం తగ్గకుండా జాగ్రత్త పడాలి. వడదెబ్బ తగిలినట్టు అనుమానం వస్తే వైద్యులను సంప్రదించాలి. **- సంతోష్ చిట్టిమిళ్ల, వైద్యులు**



## యెండల లక్ష్మీనారాయణ అరెస్ట్

**అక్షరటుడే, బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణల్లో గాయపడిన కార్యకర్తలను పరామర్శించేందుకు వెళ్తున్న బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ను పోలీసులు అరెస్ట్ చేశారు. నసురుల్లాబాద్ మండలం అంకోల్ వద్ద ఆయనను అదుపులోకి తీసుకొని నిజామాబాద్ లో ఉన్న ఆయన నివాసానికి తరలించారు. యెండల మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువులపై దాడులు పెరిగాయన్నారు. బాన్సువాడలో జరిగిన రాళ్లదాడుల ఘటనలో అసలు దోషులను అరెస్ట్ చేయకుండా, హిందువులనే అక్రమంగా అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. పోలీసులు రాజకీయ ఒత్తిడికిలోనై బాధితులపైనే వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. హిందువులపై రాళ్లదాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే బాన్సువాడ నియోజకవర్గం మొత్తం నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## రేపు గాంధారికి ఎమ్మెల్యే రాక

**అక్షరటుడే, గాంధారి :** గాంధారి మండల కేంద్రంలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్ మోహన్ విచ్చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అంతే కాకుండా మండల కేంద్రంలో జరుగుతున్న మల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొంటారు.

## వేంకటేశ్వర స్వామి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని కుకునూర్‌లో వేంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. వేడుకల్లో బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామివారి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## సమయం ఖరారు చేసి చెప్పాలి..



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములు అన్యాక్రాంతం అయిన విషయంపై ఎమ్మెల్యే సవాల్‌కు తాము సిద్ధమని, సోమవారం కలెక్టరేట్‌కు ఏ సమయానికి చర్చకు రావాలో చెప్పాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆదివారం ఎమ్మెల్యేకు బహిరంగ లేఖ విడుదల చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో జరిగిన అక్రమాలపై సోమవారం కలెక్టరేట్ వద్ద ఆధారాలతో సహా వస్తానని ఎమ్మెల్యే తెలపడాన్ని ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం స్వాగతిస్తోందన్నారు. ప్రజా సమస్యలపై, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కాలేజీ భూముల విషయంలో తమ సంఘం ఎప్పుడూ రాజీలేని పోరాటం చేస్తూనే ఉందని తెలిపారు. ఎమ్మెల్యే విసిరిన సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని, చర్చకు రావడానికి మేము పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. కళాశాల భూముల్లో జరిగిన అక్రమాలు, భూములు ఎలా అన్యాక్రాంతమయ్యాయో ప్రతి అంశాన్ని ఆధారాలతో సహా నిరూపించడానికి తమ వద్ద సాక్ష్యాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాజకీయ లబ్ధి కోసం కాకుండా, నిజాయితీగా అక్రమాలను వెలికితీసే ఉద్దేశం ఎమ్మెల్యేకు ఉంటే మాటకు కట్టుబడి చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

# బీజేపీ చీఫ్ రాంచందర్ రావు అరెస్ట్..

**అక్షరటుడే, హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. కామారెడ్డి, బాన్సువాడ వెళ్లడానికి ఆయన యత్నించగా.. అనుమతి లేదని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నాయకుల మధ్య సవాళ్లతో రాజకీయం వేడెక్కిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేకు మద్దతుగా శనివారం పలువురు బీజేపీ నాయకులు కామారెడ్డి వస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే బాన్సువాడలో ఓ దుకాణంలో పాతశాల విషయం రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. దీంతో కామారెడ్డితో పాటు బాన్సువాడ వెళ్లడానికి రాంచందర్ రావు ఆదివారం యత్నించారు. చలో కామారెడ్డికి బీజేపీ పిలుపునివ్వడంతో పోలీసులు ఉదయం నుంచే రాంచందర్‌రావు ఇంటి వద్ద భారీగా మోహరించారు. మరోవైపు బీజేపీ కార్యకర్తలు సైతం పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో కామారెడ్డికి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు అన్నారు. అయినా ఆయన బయలుదేరడంతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. అనంతరం ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కామారెడ్డిలో హైటెన్షన్ కొనసాగుతోంది. పట్టణంలో భారీగా పోలీసులు మోహరించారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులు రాకుండా చర్యలు చేపట్టారు. ముఖ్య నేతల ఇళ్ల దగ్గర పోలీసులు మహోరించారు. కేటీఆర్ ఇంటి దగ్గర ఏఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు అరెస్ట్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ఖండించారు. దాడి చేసిన వారిపై చర్య తీసుకునే బదులు, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ప్రతిపక్ష నాయకుడిని నిర్బంధించాలని నిర్ణయించుకుందని విమర్శించారు. కాంగ్రెస్, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నాయని ఆరోపించారు. బాన్సువాడలో బాధితులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి లాంటి రోజులు ప్రారంభమైనట్లు కనిపిస్తోందన్నారు.



## ఎమ్మెల్యేకు ప్రాణహాని..: బీజేపీ జిల్లా అధ్యక్షుడు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి ప్రాణహాని ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం సాయంత్రం జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వందల మంది పోలీసుల కళ్లుగప్పి శనివారం నాడు ఓ కాంగ్రెస్ నాయకుడు కారుతో వచ్చి క్యాంప్ కార్యాలయంపై దాడికి యత్నించాడని చిన్నరాజులు అన్నారు. జిల్లా ఎస్పీ సూచనతో ఎమ్మెల్యే ఇంట్లోనే ఉంటే కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారం మాట్లాడారని తెలిపారు. తమ ఎమ్మెల్యేపై ఈగ వాలినా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులకు నీతి, నిజాయితీ ఉంటే సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ వద్దకు డాక్యుమెంట్లతో వచ్చి ఆరోపణలు రుజువు చేయాలని సవాల్ చేశారు. తప్పు ఉంటే కలెక్టర్ ఎదుటే స్పీకర్‌కు ఫోన్ చేసి రాజీనామా ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి సమస్య పరిష్కరించాలని, ఇక్కడితో ఈ అంశాన్ని ముగించాలని సూచించారు. కాదు కూడదు ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తామంటే తాము కూడా సిద్ధంగా ఉంటామని చెప్పారు. తమ ఎమ్మెల్యేకు ప్రాణహాని ఉందని, ఆయనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. రక్షణ కల్పించకుండా తాత్సారం చేస్తే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.




## కార్పొరేటర్ సుమిత్ర కిషోర్‌కు సన్మానం



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగరంలోని గాయత్రి నగర్‌లో గల గాయత్రి చైతన్య కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్పొరేటర్ సుమిత్ర కిషోర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఆడెపు నరేంద్ర స్వామి మాట్లాడుతూ కార్పొరేటర్ సుమిత్ర కిషోర్ గతంలో చేసిన అభివృద్ధి పనులు, మంచితనం.. మళ్లీ విజయం చేకూర్చాయన్నారు. నగరంలోనే సుమిత్ర కిషోర్‌కు అత్యధిక మెజారిటీ రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దోమల పండరి, కోశాధికారి కట్కా భూమేష్, ఉపాధ్యక్షుడు కట్ట శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా చైన్ స్నాచింగ్..

**అక్షరటుడే, కామారెడ్డి:** చైన్ స్నాచర్‌లు రెచ్చిపోతున్నారు. గల్లీ రోడ్ల నుంచి రహదారుల వరకు ఎక్కడ పడితే అక్కడ దోపిడీకి తెగబడుతున్నారు. బంగారం ధర పెరుగుతూ పోతుండడంతో వాటి ఆభరణాలకు రక్షణ లేకుండా పోతోంది. కామారెడ్డి జిల్లాలో మరో చైన్ స్నాచింగ్ చోటుచేసుకుంది. కామారెడ్డి పట్టణానికి కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగింది. భర్తతో కలిసి బైకుపై వెళ్తున్న మహిళ మెడలో నుంచి దుండగులు పుస్తెల తాడు లాక్కెళ్లారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కమ్మరి శ్రీనివాస్ తన భార్య అనంతలక్ష్మి కలిసి జువ్వాడి గ్రామానికి వెళ్తున్నారు. తాడ్వాయి నుంచి దగ్గరగా ఉంటుందని వెళ్తుండగా.. దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాల సమీపంలో గుర్తుతెలియని దుండగులు బైకుపై వచ్చి అనంతలక్ష్మి మెడలో నుంచి పుస్తెల తాడు లాగారు. వారు లాగిన ఫోర్స్‌కి బైక్ స్కిడ్ అయి భార్యాభర్తలు ఇద్దరు కింద పడిపోయారు. దీంతో శ్రీనివాస్ ముఖానికి గాయాలయ్యాయి. పుస్తెల తాడు లాక్కుని దుండగులు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా గాయపడిన శ్రీనివాస్‌ను జీజీహెచ్‌కు తరలించారు.



# మూసీనదిని తలపిస్తున్న

# గాంధారి వాగు

- దుర్గంధంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు
- ప్రక్షాళన చేయాలంటున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు

**ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో పారే గాంధారి వాగు తన ఆనవాళ్లు కోల్పోయింది. ప్రస్తుతం మురికినీరు ప్రవహిస్తుండడంతో వాగు దుర్గంధ భరితంగా మారింది. గాంధారి మండలానికి సంబంధించిన డ్రెయినేజీ పైప్‌లైన్లను వాగులోకి అనుసంధానం చేయడంతో వాగు కాస్త మూసీనదిని తలపిస్తోంది. వాగు పక్క నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

**– అక్షరటుడే, గాంధారి**

కాళేశ్వరం ప్యాకేజీ 23-24 కింద గాంధారి వాగు ఉంది. ఈ వాగునీళ్లు మండలంలోని చద్మల్ తండా వద్ద, గట్టుకింది తండా, తిప్పారం తండా మీదుగా గాంధారి వాగులోకి వచ్చి లింగంపేట మీదుగా పోచారం ప్రాజెక్ట్‌లో ఈ నీళ్లు కలుస్తాయి. గాంధారి మండల కేంద్రంలో సుమారు 6 కి.మీ. పరిధిలో వాగు విస్తరించి ఉంది.

### గత వర్షాకాలంలో..

గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించింది. స్థానికంగా ఉన్న వంతెన పైకి నీళ్లు వచ్చి కూలిపోతుందేమో అన్నట్లుగా పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ వాగు వద్ద ఉన్న గంగమ్మ గుడి సైతం శిథిలమైంది. అమ్మవారికి విగ్రహం కూడా ఒకచోట నుంచి మరోచోటకు కదిలింది. దీనిని అమ్మవారి ఆజ్ఞగా భావించిన ప్రజలు అక్కడే గుడి నిర్మాణం చేపడుతున్నారు. అయితే గుడి నిర్మాణానికి సైతం వాగు మురికినీళ్లు వాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం గంగమ్మ తల్లి గుడి నిర్మాణానికి మురికినీరు కాకుండా ట్యాంకర్ల ద్వారానైనా నీటిని వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఒకప్పుడు పుణ్యస్నానాలు చేసే వాగు..

గతంలోప్రతిఏటా మాఘమాసంలో గ్రామస్థులంతా వాగులో పుణ్యస్నానాలు చేసేవారు. మండలంలో రోడ్ల నిర్మాణం.. ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించిన



అనంతరం నీళ్లను వాగులోకి కలిపారు. దీంతో వాగు పూర్తిగా తన రూపు కోల్పోయింది. మురికి నీరు పారుతుండడంతో స్నానాలు చేసే భక్తులు రావడం మానేశారు.

### పూర్వ వైభవం తేవాలి..



గాంధారి మండల కేంద్రంలో వాగుకు ఎంతో విశిష్టత ఉంది. మాఘమాసంలో ఎక్కడెక్కడి నుంచో ప్రజలు ఇక్కడ స్నానమాచరించడానికి వచ్చేవారు. ప్రస్తుతం వాగు దుర్భరస్థితికి చేరుకుంది. మురికినీళ్లు పోయేందుకు ప్రత్యామ్నాయ మార్గం చూడాలి. వాగులో చిన్నప్పుడు స్నానాలు చేసిన జ్ఞాపకాలు గుర్తొస్తాయి. వాగును వెంటనే ప్రక్షాళన చేయాలి.

**– ఆరెకటిక మోతిలాల్, రచయిత**

## ముప్కాల్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలం చేతన్ నగర్ గ్రామంలో స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు అఖిల్, ఇర్ఫాన్ ఆధ్వర్యంలో దాదాపు 70 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ప్రజలకు ఉచిత సేవలందించినందుకు డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కురాడే కాంత (సునీల్), ఉప సర్పంచ్ గైక్వాడ్ యాదవ్‌ను హాస్పిటల్ వారు సత్కరించారు. కార్యక్రమంలో నర్సింలు, లక్ష్మణ్ పంచాయతీ కార్యదర్శి బాలాజీ, జీపీ సిబ్బంది కపిల్, వడ్ల సురేష్ పాల్గొన్నారు.

## మాధవానంద సరస్వతి స్వామికి చిత్రపటం బహూకరణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అందోల్ నియోజకవర్గం రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామికి ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ప్రముఖ జాతీయ చిత్రకారుడు చుక్క గోపాల్ గౌడ్ తన స్వహస్తాలతో గీసిన స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. బాన్సువాడ మండలం బుడిమి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవానికి విచ్చేసిన స్వామి వారిని మర్యాద పూర్వకంగా కలుసుకుని అందజేశారు. ఈ సందర్భంగా చుక్క గోపాల్ గౌడ్ చిత్ర కళను చూసి మంత్ర ముగ్ధులై అభినందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బుడిమి గ్రామానికి చెందిన నారాయణ ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఆర్ఎంపీ వైద్యులు తిరుమల గౌడ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 'మన్ కీ బాత్' వీక్షించిన బీజేపీ నేతలు



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ పట్టణంలో బీజేపీ సీనియర్ నాయకులు కలిగోట గంగాధర్ నివాసంలో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. మన్ కీ బాత్ ప్రోగ్రాం ద్వారా ప్రధాని వివిధ రంగాలలో విజయం సాధించిన వారిని నేరుగా అభినందిస్తూ, ప్రపంచానికి పరిచయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పోహార్ నవీన్, తోట నారాయణ, మల్లయ్య, జగన్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**అక్షరటుడే, ఆర్మూర్ :** కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి అన్నారు. 14వ వార్డు పరిధిలోని జిరాయత్ నగర్ ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ఛైర్‌పర్సన్ లహరి రఘు, వైస్ ఛైర్మన్ కాటిపల్లి వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లను కాలనీవాసులు సన్మానించారు. స్థానిక కౌన్సిలర్ సోను, ఆర్మూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్ , కౌన్సిలర్లు భుపేందర్, శాల ప్రసాద్, విజయ్, నాయకులు వాసు, జిమ్మి రవి, అజ్జు, దామోదర్ సంతోష్, చిట్టి పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల్ని కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు..

**అక్షరటుడే, ఆర్మూర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కె. సూర్యం విమర్శించారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఆదివారం టీయూసీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్మికులకు సరైన వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులకు సరైన వేతనాలు లేదని, ఉద్యోగ భద్రత లేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని వాపోయారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం పెట్టుబడి దారి వర్గం సేవ కోసమే లేబర్ కోడ్స్‌ను రద్దుచేసి మండిపడ్డారు. నాలుగు కార్మిక చట్టాలను మార్చి కార్మికుల కడుపు కొట్టారని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా పోరాడే సాధించుకున్న హక్కులను కబలించడమంటే సంపన్నుల మోచేతి నీళ్లు తాగడమేనన్నారు. కార్మిక సంఘాలు సంఘటితమై తమ హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమానికి




టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ముత్తన్న అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రమేష్, ఉపాధ్యక్షులు వి.సత్యవ్వ, ప్రకాష్, సహాయ కార్యదర్శి అనిస్, కోశాధికారి అరవింద్, జిల్లా నాయకులు కిషోర్, పుష్పలత, ఎ.ఆశన్న, నశిర్, లక్ష్మి, పద్మ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల



**అక్షరటుడే, భీమ్‌గల్ :** మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆర్జీ ఇన్‌ఫ్రా డెవలపర్స్' కార్యాలయాన్ని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. సికింద్రాపూర్‌కు చెందిన యువ ఇంజినీర్ సాగర్ దొన్కంటి ఆధ్వర్యంలో సంస్థను నెలకొల్పారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి.. సాగర్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక యువత సొంతంగా వ్యాపార రంగంలో రాణించడం సంతోషకరమన్నారు. నిర్మాణ రంగంలో నాణ్యమైన సేవలు అందిస్తూ సంస్థ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, సాగర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొన్న కారు.. ఒకరి మృతి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన కమ్మర్‌పల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కమ్మర్‌పల్లి మండలం కేసీఆర్ కాలనీకి చెందిన ఎర్రోళ్ల లస్మయ్య (75) తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై కమ్మర్‌పల్లికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. మార్గమధ్యంలో జాతీయ రహదారి 63పై కేసీఆర్ కాలనీ కమాన్ సమీపంలో కారు ఢీకొంది. మోర్తాడ్ వైపు నుంచి కమ్మర్‌పల్లి వైపు వస్తున్న టాటా టిగోర్ కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ వచ్చి లస్మయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ లస్మయ్య అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.అనిల్ రెడ్డి తెలిపారు.

## మార్కెట్ కమిటీ ఆవరణలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు ఆవరణలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రపర్చారు. గేటు వద్ద ఏర్పాటు చేసిన రైతు చిహ్నం వద్ద చెత్తను తొలగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. 43 వారాలుగా ఈ స్వచ్ఛ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోందన్నారు. రైతులు దేవాలయంగా కొలిచే ఈ మార్కెట్ కమిటీ యార్డులో స్వచ్ఛభారత్ నిర్వహించే అవకాశం తమకు కలిగిందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేద జీడీ రాజ్ కుమార్, జంగిడి భోజన్న, బాశెట్టి గంగారాం, చోళ రాకేష్, గణేష్, అనిరుధ్, రాహుల్ రాజ్, కృషివర్ధన్, తదితరులు పాల్గొన్నారు.